


దిక్కులేని చావు.

రంగారావుని చివరకి నలుగురు మిత్రుల సాయంతో మట్టి చేయవలసి వచ్చింది. శ్మశానాన్నించి వచ్చేప్పుడు మా మధ్య మసలిన మవునం గుండెల్ని పిండిచేసింది. మా నలుగురి వెనక రంగారావు వస్తున్నట్లు తన ప్రవృత్తికి తగినట్లే మవునంగా వున్నట్లు అనిపించింది. ఎంత లేదనుకున్నా పదిసార్లయినా వెనక్కు తిరిగి చూశాను. 'ఏరా! రంగా ఏదైనా మాట్లాడరా' అందామన్నంత ఆవేశంతో.

భయంకరమైన శబ్దాలను భరించవచ్చు కాని, ఈ గడ్డకట్టిన నిశ్శబ్దాన్ని భరించటం కష్టం.

"ఒరే రవణా! నీకు తెలుసునో లేదో మొట్టమొదట రంగడూ నేనూ కలిసివున్న రోజుల్లో పోట్లాడుకున్నాంరా..."

రవణ మాట్లాడలేదు. వాడికి ఈ విషయం పదిసార్లయినా చెప్పి విసిగించి వుంటాను. మనకు సంబంధించిన విషయాలు వినటానికి ప్రతివాడికి ఉత్సాహం వుంటుందనుకోవటం అవివేకం.

నాకు తెలుసు.

వాడు విసుక్కున్నా సరే తప్పదు.

'రవణా! మళ్లా రంగడు వచ్చి పోట్లాడితే బావుణ్ణని పిస్తోందిరా-వెధవది కాలం వెనక్కు తిరగదు కదా'.

* * *

'రంగారావుగారూ! మా శశి ఉత్తరం, రాసిందండీ'

'అలాగా'

'బలే రంజయిన ప్రేమకథలెండి మాది. మీరు వినాలి. మీ కథలకు బ్రహ్మాండమైన ప్లాటు. అసలు మొదట్లో నేనూ శశీ మాట్లాడుకోవటమే తక్కువ. తరువాత ఎలా కలిశామో ఏమో మనసులు-మనుషులు ఒకటిగా కలిసిపోయాం. ఆ పుస్తకం తరవాత చదవచ్చులెండి. ముందు వినండి. ఉన్నట్టుండి శశి తనకేవో ఆటంకాలు వచ్చాయని వివాహానికి అవకాశం లేదని-నా ఆశల్ని పుటుక్కున తెంచింది. అప్పుడు నేను పడిన బాధ ఆ మజ్నూ, దేవదాసు కూడా పడివుండరు వింటున్నారా-అప్పుడు మా చెల్లాయి ఏం మంత్రం వేసిందో ఏమో శశిచేత ఉత్తరం రాయించింది. ఆడవాళ్ళ మనసులు ఆడవాళ్ళకే అర్థమవుతాయి చూడండి. మళ్ళా కొన్నాళ్లు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రాణాలు పోయాయి మా ఉత్తరాలు బట్వాడా చెయ్యలేక, హ్హ హ్హ - తరవాత సడెన్‌గా నా వైపునించి ఒక అబ్జక్షన్ వొచ్చి పడింది. చూశారా కథలో ఎన్ని మలుపు లున్నాయో- అసలు ఈ కథ నేనే రాసేవాణ్ణి సార్! కాని మా గురువుగారు ప్రమాణం చేయించారు కథల జోలికి పోనని. సరే, - శశికి జాబు రాశాను నా పరిస్థితి వివరిస్తూ. దానికి బోల్డు కోపం వచ్చి - మన జీవితాలింతే-రైలు పట్టాలు' అంటూ ఓ జాబు రాసింది, భలే టైటిల్ కదండి - 'రైలు పట్టాలు' నోట్ చేసుకోండి సార్. అసలా పుస్తకం అవతల పెట్టండి,'

'చూడండి - మీ కథ తరవాత వింటాను ముందిది పూర్తిచేసి రేపు రిటన్ చేయాలి'

'దానేముంది సార్ - వినండి ఇంకొంచమే వుంది. ఆనక మా చెల్లాయే మళ్ళా కలగజేసుకుని నన్ను నానా తిట్లు తిట్టి నా పిరికితనాన్ని కడిగేసింది. దాంతో వొళ్లు తెలియని ఆవేశంవచ్చి శశికి మళ్ళా ఓ జాబు రాసేశాను గట్టిగా - వింటున్నారా - శశికి నాకు మిసండర్‌స్టాండింగ్స్ వచ్చినప్పుడు మెడిసిన్ థర్డు ఇయర్ మీద వొళ్లు తెలీని కోపం వచ్చేది. అసలీ ప్రేమ మూలంగానే కదా మూడోయేడు మూడోయేడు చదువుతోంది అనిపించేది. ఇప్పుడు శశికూడా జాబు రాసేసింది. ఇంక మూడేళ్ళు కాదు మూడో సంవత్సరమే ముప్ఫయ్యేళ్లు చదవమన్నా చదువుతాను. ఏవంటారు'.

'ఏవనమంటారు. అసలు మీరు నన్ను ఏమన్నా అననిస్తేగా. ఇప్పుడు అవకాశం ఇచ్చారు కాబట్టి అంటున్నాను, మీకు ఎదుటివారి మనసు అర్థం చేసుకోవటం తెలియదంటాను.

మీ రింకో రెండు నిమిషాలు మాట్లాడితే నా ఓర్పు నశించి వెంటనే ఈ రూము మారేవాడినంటాను. దయచేసి ఇప్పటికైనా నన్ను వంటరిగా వదిలి వెళ్తారా'.

* * *

'ఒరే రవణా! ఈనాడు మాత్రం వాడు అడగకుండానే శ్మశానంలో వంటరిగా వదిలి వచ్చేస్తున్నానురా. తలచుకుంటే గుండె తరుక్కుపోతోంది. ఆనాడు వాడు అంతమాటన్నా నా గొడవ సరిగ్గా వినలేదని తిట్టుకుంటూనే వదిలాను. ఏవనుకున్నానో తెలుసా- ఇంత బ్రహ్మాండమైన ప్లాటు చెబుతుంటే వినడేమిటి ఈ పిచ్చి కథకుడు అనుకున్నాను- ఏవంటారు.'

ఎవరూ ఏమీ అనలేదు.

'ఒరే సుబ్బిగా! ఏం మాట్లాడవేంరా వెధవా ఊరింకా రెండు మైళ్లుంది. కనీసం ఓ కొట్టండ్రా- నా వాగుడేదో నే వాగేస్తాను.'

సుబ్బారావు ఈ పోరు పడలేకపోయాడు.

'రంగారావుగురించి చెప్పరా- నీ ప్రేమకథలు మామూలేగా.'

'అలా అన్నావు బావుంది. చెబుతా వినండి... అలా మేము పోట్లాడుకున్న తరవాత వీడిగురించి ఆరా తియ్యాలని బుద్ధి పుట్టింది. కాలేజీలో కనబడ్డ ప్రతివాణ్ణి అడిగాను. ఒహడూ చెప్పలా- ఎవడు చెబుతాడు. మనవాడికి మిత్రుడని చెప్పుకోతగిన వాడు ఎవడైనా వుంటేగా — ఇది పనికాదని వాడి కథ లెక్కడున్నాయో వెతికాను. ఎందు కంటా వేమో, ఈ కవిగాళ్ళకి జీవితంలో బాధ లెక్కువన్న విషయం మనకు తెలిసిందేగా-కొందరు జీవితంలో బాధ లేకపోయినా తెచ్చిపెట్టుకుని మరీ ఏడుస్తారట - లేకపోతే రచనలు 'మూవింగ్'గా వుండవని. ఎందు కంటావేమో-రచనల్లో రచయిత జీవితంప్రతిబింబిస్తుందని చెబుతారుగదరా-అందుకు. వాడి కథలన్నీ బయటకు తీశా - అసలీ విషయం మీద మనకు నమ్మకం లేదు. ఎందుకంటావేమో? జీవితంలో పగలుచూస్తే రాత్రి కల్లోకి వచ్చేంత వికారంగా వుండి. పరమ దరిద్ర్యాన్ని అనుభవించే వాళ్ళు రచనలలో మాత్రం-పాళ్ల తామరలావుండే వాళ్ళని, మారిస్ కార్లలో తప్ప తిరగని వాళ్ళని సృష్టించటం మనం చూడటంలా - ఎందుకంటా వేమో -'

'అబ్బ - అనన్లేరా బాబూ - చెప్పు'

'ఏరా కవిత్వం గురించి నేను కవిత్వం చెబుతున్నట్లుందా - సరే ఆపేస్తాను. ఆ కథల్లో ఒక కథ - సరిగ్గా వాడి జీవిత కథే అయివుంటుందని పించింది నాకు. దానిపే : "కార్తీకదీపం"

* * *

సంజె చీకటి పడింది. వెంకట్రావు మాత్రం కటిక చీకటి కొండచిలువలా పెనవేసుకుపోతున్నా పట్టించుకొనే స్థితిలో లేడు. అలానే గుడి మండపం మీద పడుకున్నాడు. ధ్వజస్తంభం మీద కార్తీక దీపం వెలిగింది. మండపంలో చీకటి కాస్త పక్కకు తొలగింది. మనక వెలుతురు వెంకట్రావు ఆలోచనల్ని కదలబారేట్లు చేసింది.

చిన్నప్పుడు విజయతో కలిసి నాన్న, మావయ్య కట్టిన సవారిబళ్ళలో పోటీలు పడుతూ కేరింతలు కొడుతూ సముద్రానికి వెళ్ళింది ఈ కార్తీక మాసమే.

ఆనాటి పోటీలే ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమికి నాన్నకి మావయ్యకి మధ్య పోటీలుగా మారాయి.

మనసులు కలిసినన్నాళ్ళు ఎడ్ల పరుగు పందెం పూర్తి కాగానే అందరూ కలసి విందు భోజనాలు చేసేవారు. విజయ, తను సరాగాలాడితే వియ్యాలవారి వినోదాల విందు లనేవారు. మనసులు విరిగాయి. కలతలు పెరిగాయి. పొలం దగ్గరా, ఇళ్ళస్థలం దగ్గరా వచ్చిన తగాదాలు కలం పోట్లతో కోర్టుల కెక్కాయి. సరదాగా గడిచే ఎడ్ల పరుగు పందాలు పదిమందిలోనూ పరువు పందాలుగా మారాయి.

కక్షలూ, కావేషాలూ పెరిగి, అంతరంగాలు తరిగి, పనిమనసులు మరిగిపోయాయి. కుటుంబాలను, పరువు ప్రతిష్టలను, సంప్రదాయాలను, మంటగలిపి - బంధుత్వాలు కలుపుకోలేక - విడివిడిగా అనురాగాల్ని నిలుపుకోలేక విజయ తనూ కుళ్ళిపోయారు. ఒకనాడు ధైర్యంచేసి విజయ తనూ ఇంటినించి బయల్దేరారు. అదీ కార్తీక మాసమే - పున్నమిరోజే - పొలిమేరలోనే పట్టుబడ్డారు. తరవాత విజయకు పెళ్ళయింది. తను మాత్రం గుడిలో ధ్వజస్తంభంలా పాపాలకు శాపాలకు రూపంలా చలనం లేక నిలబడిపోయాడు.

ఆలోచనలతో, గత స్మృతులతో తల పగిలినట్లయింది వెంకట్రావుకి.

గుడి గోపురం పైనించి కిందకి దూకేశాడు, అతని బతుకు తెల్లవారింది.

పగటి వెలుగులో కార్తీక దీపం వెలవెల పోయింది

* * *

'ఎంతో బాధ పడ్డానురా ఆ కథ చదివి.అప్పుడు తెలిసింది - నా కథ చెబుతున్నప్పుడు రంగ డెందుకు వినుకున్నాడో - నాకు గట్టి నమ్మకం కలిగింది, వాడి జీవితంలో సరిగ్గా ఇలాటి సంఘటనే జరిగివుంటుందని-అదే అడిగేశాను. కాదన్నాడు.

* * *

'మీ కథ కానప్పుడు వెంకట్రావునలా అన్యాయంగా చంపటం తప్పంటాను.'

'ఎందుకని'

'మీ జీవిత కథే అయితే - మీ జీవితం అలా అంతం కావాలని మీ ఆశ అనే కాని అలా చావటానిక్కూడా ధైర్యం లేక ఇలా జీవచ్ఛవంలా బతుకు తున్నారని అనుకునే వాడిని. కాని రచయిత ఇలాటి పిరికిమందు లోకానికి నూరిపోయకూడదు. అది నా ఉద్దేశం'

'మీ ఉద్దేశం మంచిదే. కాని వెంకట్రావు చెయ్యగలిగిందిలేదు. ఏమీ చెయ్యానూలేడు. అత నంతటి పిరికివాడు. అలాటి జీవితానికి అలానడిచిన వాడికి , అదేముగింపు నా కిష్టం.'

'కావచ్చు కాని మీరా విషయం చెప్పకూడదు. వెంకట్రావుని గుడిమండపంమీద చీకట్లోవదిలేసి కథకు మంగళం పాడండి ఒప్పుకుంటాను. నాకు కథలు రాయటం చేతకాదు. మా గురువుగారు చెప్పారు.ఒకసారి ఓ పెద్ద ట్రాజెడీ రాశాను, అప్పు డాయన 'ఒరే అబ్బీ - సంఘం మనపాత్రలకి ఉరిశిక్ష విధిస్తుంది. రచయిత ఆ ఉరిత్రాడు తెగ్గొట్టే శక్తిని సంపాయించాలి. ఆ శక్తిని ఆ పాత్రకు యివ్వాలి. కన్నీళ్ళనించి కరెంటు పుట్టించాలి. విరాళనించి నిప్పుకణంలాటి జీవితాన్ని సాధించాలి. అంతేగాని - అమ్మమ్మలా ముసలి కబుర్లు, నీతి పురాణాలూ చెప్పకూడదు.'

* * *

'ఇది వాడితో నా ఆర్గ్యుమెంటు'

'నే నమ్మను. నువ్వంత బాగా మాట్లాడటం కలలో మాట' అన్నాడు సుబ్బారావు.

'ఏరా- ప్రఖ్యాత రచయిత రంగారావుతో ఇరవై ఏళ్ళ స్నేహం చేశాను. ఆ మాత్రం జ్ఞానం నాకు లేదంటావా ? రాదంటావా ?'

'రావచ్చు - నాకు నమ్మకం లేకపోయినా వప్పుకుంటున్నాను. కాని అనాడు అలా మాట్లాడావా ? అని'

'ఒరే నేనేదో వాగుతున్నానుగా - ఇదింకా ఒక మైలు పొడుగు సాగాలి - నాకు అర్థం రాదు.'

'నే నెక్కడ అర్థం వచ్చాను. నువ్వే చెబుతున్నది ఆపి 'ఇది నా ఆర్గ్యుమెంటు' అంటూ ఓ పోజిచ్చావు కదా -'

సరే ఇవ్వన్లేవిను. ఆ తరువాత ఎలాగైతేనేం - వాడి జీవితం గురించి వాడిచేత చెప్పించాను. అది నే నూహించిన కథకి చాలా దగ్గరయింది. చూశావా మరి నువ్వేదో నన్ను అండరెస్టిమేట్ చేస్తున్నావు.

* * *

'ఇంతవరకు నేనెవరితోనూ ఈ విషయాలు చెప్పుకోలేదు. మీదగ్గరైనా-మీరింత దగ్గర వారయ్యారు గనక చెప్పుకో గలిగాను' 'ఏం లాభం. ఇంత దగ్గర వాడినైనా నాకు 'మీరులు, అండిగలు' తప్పటం లేదయ్యే'

'అదే నాలో లోపం. చెప్పానుగా-చిన్నతనం లోనే వంటరి వాడి నవటం, పదేళ్ళకే బాధ్యతలు నెత్తినపడటం, పెరిగిన వాతావరణం కంసుడులాటి మేనమామ ఇల్లు కావటం-నన్ను మనిషిగా సరిగా పెరగనివ్వలేదు.

ఆ చీకట్లో వెలుగురేఖ

ఆ వెల్లువలో గడ్డిపోచ

విజయ నాపైన చూసిన అభిమానం, అనురాగం, దురదృష్టవంతుణ్ణి ఆ వెలుగు రేఖ మలగిపోకుండా నిలుపుకొనే ధైర్యం లేకపోయింది. ఆ గడ్డిపోచ తొలగి పోకుండా కాచుకో గలిగిన గుండె లేకపోయింది.

అదే పిరికితనం నన్ను సర్వవిధాలా వెధవను చేసింది. వ్యర్థుణ్ణి చేసింది.'

'రంగా ! ఏ గాలివాలుకో కొట్టుకొచ్చి మనిద్దరం ఓ చూరు నీడన కట్టుపడ్డాం. ఈ మైత్రిబంధం యిక వీడదనుకో - ఈ స్నేహగంధం ఇక తొలగదనుకో.'

* * *

'అలాటి పిరికివాడు యింతటి గొప్ప రచయిత కావటం- ఇన్నిసన్మానాలు పొందటం ఆశ్చర్యమే.'

'దానికి నేనే బాధ్యుణ్ణని సగర్వంగా చెప్పుకుంటానురా- అదే నాకు మిగిలిన సంతృప్తి.'

* * *

'మీ ఆసరాతోనే నేను నిలబడగలిగాను. ఇన్నాళ్ల మిమ్మల్నెంత బాధపెట్టానో - నాకు తెలుసు నన్నే

డబ్బు మహాత్మ్యం

డబ్బు పారేస్తే సరి
యమ సదనం కూడా
అత్తిల్లుగా మారిపోతుంది.

—శరత్ చంద్రుడు

వరూ భరించలేరని.'

'రంగా! ఆ మాటే అనవద్దన్నాను నేను ముందేచెప్పాను మనబంధం విడిపోదని. సాయం సంగతంటావా-మరోడు చేసేవాడు. చదువుకుంటానంటే సాయం చెయ్యనస్థితికి మన నాగరికత పెరగలేదురా. ఒకవేళ సాయపడినా చదివేవాడికి చదువబ్బద్దూ - ఇదే ఎమ్మే - పదేళ్ళపైమిచ్చినా నేను పూర్తిచెయ్యగలనా!?'

'దీనికి ప్రతిఫలంగా ఒకటే యివ్వగలను. నా అభివృద్ధే మీకు సంతృప్తి నిస్తుందని, నా దగ్గర్నుంచి మీరేదీ కోరరని నాకు తెలుసు. ఈనాడు ఇక్కడ నిలబడి వాగ్దానం చేస్తున్నాను.

నన్ను పిరికివాడిగా చేసి తలెత్తుక బతకకుండా చేసిన ఈ లోకంతో జోహారు చేయించుకుంటాను. ఈ మనుషులతో ఆడుకుంటాను నా దరిద్రాన్ని గుర్తురానివ్వని భోగాలలో మునిగి తేల్తాను'

* * *

'వాడి మాటలకు ఆశ్చర్యపోయాను. ఆనంద పడ్డాను. సెబాస్ అన్నానురా ఆనాడు. వాడంత పేరు సంపాయించిన నాడు దూరంగా వుండి జీవితమంత తృప్తి ననుభవించాను. ఒకసారి మాత్రం వాడే రమ్మంటేవెళ్ళి కలిశాను. వాడనుభవించేది దేవేంద్ర భోగమే. అంత ఆనందంలోనూ ఒకే అపశ్రుతి విని పించింది. ఉండబట్టలేక అనేశాను.

* * *

'ఒరే రంగా! - నీ కోరికలన్నీ నెరవేరాయి. ఏం సాధించాలనుకున్నావో అది సాధించుకున్నావు. పెళ్ళికూడా చేసుకున్నావంటే ఈ ఆనందానికి పరిపూర్ణత చేకూరుతుంది.'

'నాకు తెలుసు మీరీ మాట అంటారని. తురంగంలా పరుగులు తీస్తున్న నా జీవితరంగంలో ఎవరో ఒకరు కళ్ళెం పట్టకపోతే ఈ ఆనందం వంకరలు తిరుగుతుందని కూడా తెలుసు'

'మరి చేసుకుంటావా.'

'ఎలా చేసుకోగలను. నా గుండెలో విజయకి గుడికట్టాను. అది పగలకొట్టి సమాధిగా ఎలా మార్చగలను. ఆ మాట మీరుమాత్రం అనగలరా'

'అనలేననుకో - కాని నువ్వే అంటున్నావుగా జీవితం సాఫీగా నడవదేమోనని - దానికోసమైనా'

'ఇంతకాలానికి నేనో పరమ సత్యం గుర్తించాను. మనిషిగా స్థాయిని బట్టి, తాహతుని బట్టి తనను తాను సంతృప్తి పరచుకోవాలి. ఎవరిమీదో పగసాధించాలనుకోటం వెర్రి. ఇన్నాళ్ళూ నిప్పులు చిమ్ముకుంటూ నింగికి ఎగిరిన రంగారావునిచూశారు ఇక నెత్తురు కక్కుకుంటూ నేల కురాలిపోయే రంగారావుని చూస్తారు.

* * *

'రవణా! ఆ తరవాత వాడి గురించి రోజుకో కబురు విన్నాన్రా. విని చేయగలిగిందేముంది. చేరువగా వెళ్ళి ఇదేమిట్రా అనలేకపోయాను. కారణమేమిటో తెలుసా? ఇదేమిట్రా ఇలా చేస్తున్నావ్ అని వాడిని అడిగే అర్హత కోల్పోయిన సంఘంలో నేనూ ఒకణ్ణి గనక. నాతో వాడిని గురించి నీచంగా మాట్లాడినవాళ్ళతో అదే మాట చెప్పాను. వాడు అనామకుడుగా - బతికి నప్పుడు ఏం చూశారు-ఏం చేశారు? ఈనాడు వాడి సంపాదన-వాడి జీవితం. ఇష్టంవచ్చినట్లు జీవిస్తున్నాడు. మీరెవరు అడగటానికి అన్నాను. అంటానుకాని - ఒరే రవణా! ఆ మాటయితే అన్నానుకాని ఆ తరవాత వాడిపరిస్థితి మరీవిషమించేసరికి ఊరుకోలేక వెళ్ళి అడిగానురా - కోప్పడ్డానుకూడా - 'ఇదేనా ప్రపంచంతో జోహార్లు చేయించుకోటం - ఇదేనా మనుషుల్తో ఆడుకోటం' అని - అప్పుడు వాడి సమాధానం ఏమిటో తెలుసా? మవునం! ఈనాడు అయిదడుగుల నేలలో ఎంత ప్రశాంతంగా ఎంత మవునంగా వున్నాడో ఆనాడూ అలానే వున్నాడు. వాడు మునిరా - మహర్షి.

'ఒరే సుబ్బిగా - అదేమాట నీతో అప్పుడంటే ఏమన్నావో గుర్తుందా-'

సుబ్బారావుకి కళ్ళనీళ్ళు వచ్చాయి.

"నీకు నచ్చితేసరి. పతిత పతివ్రత అంటావు" అన్నావు. వాడి సంగతి మీకు తెలియక అలా అన్నారు- అనుకున్నారు. ఇప్పుడు చెప్పరా. ఇప్పుడు వెయ్యరా వాడిమీద నిందలు,"

ఊరు చేరువయింది.

'పోయాడని తెలియగానే వందలూ-వేలూ సంతాపాలు, సభలు సమావేశాలు. కాటికి మోసుకుపోయేందుకు కటికవాడయినా ముందుకు రాలేదు. ఇది మన నాగరికత. ఇది మన సంస్కృతి.

తప్పులు చెయ్యకపోవటం కాదురా దేవతల లక్షణం. తప్పులు చేసినవాణ్ణి క్షమించగలగటం"

ఇల్లు చేరుకున్నాం. ఎవరో కాచుకొని వున్నారు.

'చూడండి - మీలో ఎవరైనా రంగారావుగారిని గురించి వివరాలు, విశేషాలు చెప్పగలరా?'

'దేనికి?'

'మా పత్రికను వారి పవిత్ర స్మృతికి అంకితం చెయ్యదలచుకున్నాం!'

'చెప్పరా' అన్నారు మిత్రులు నలుగురూ —

'చెబుతాను రాసుకోండి. రంగారావు అనాథగా పుట్టాడు. పిరికివాడుగా పెరిగాడు. వెన్నెముకలేనివాడుగా తిరిగాడు. ఓ ఆశ వాడిని నిలబెట్టింది. వాడిని మార్చింది. ఆ మారటం మారటం కిరాతకుడయ్యాడు. అది అతని తప్పుకాదు. ఇప్పుడతను లేడు.'

★

---

# ఇదీ భారతం

## ఎలా సన్మానించాలి

'జీతం 1,890 రూపాయలు మొదలు 6,930. ఉద్యోగం చేయవలసిన చోటు లండన్, కావలసినవారు భారతీయ పట్టభద్రులు 1,470. ఎన్నికయిన వారికి బొంబాయినుంచి లండన్ విమానంలో ఉచిత ప్రయాణ సదుపాయం.'

పట్టభద్రుడయినవాడు ఉద్యోగం లేకపోయినా ఉన్నా ఈ అవకాశాన్ని ఎందుకు వదులుకుంటాడు. సెప్టెంబరు 8 న ఆంగ్ల దినపత్రికలలో పడిన పై ప్రకటనని పురస్కరించుకొని వేలాది దరఖాస్తులు ఇచ్చిన చిరునామాకి అందాయి. ఆ తర్వాత ప్రకటనదారుడు కోరిన ప్రకారం ఐదు రూపాయిలు అనేకమంది పంపారు.

కోలారుకి చెందిన 22 సంవత్సరాల యువకుడు ప్రకటనతో ప్రారంభించిన ఈ కథ బొంబాయి మీదుగా లండన్ చేరుకోలేదు. కోలార్‌లో బంగారం దొరికినా దానిని ఆ యువకుడు పంచిపెట్టలేదు గదా! అందుకు ప్రస్తుతం పోలీసుల ఆతిథ్యం స్వీకరిస్తున్నాడు. మరి అతనిని ఎలా సన్మానించాలి?

## అసలు కారణం

ఏటేటా కేరళలోని అల్లెప్పి పురపాలక సంఘము ఒక ఎగ్జిబిషన్ నిర్వహిస్తూ వుంటుంది. ఈ యేటి ఎగ్జిబిషన్‌లో ఒక 'శాల' లో అందమైన ఇద్దరు యువతుల నృత్యం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షిస్తోంది. 'ఒక్కొక్క ఆట' కి నూరుమంది ప్రేక్షకులు ఆ నృత్యం తిలకిస్తున్నారు. ఒక 'హౌస్‌ఫుల్' ప్రదర్శన జరుగుతూ వుండగా పోలీసులు హఠాత్తుగా దాడి జరిపారు. ప్రేక్షకులు పోలీసులమీద తిరగబడ్డారు. పోలీసులు ప్రదర్శన జరుగకూడదన్నారు. ప్రేక్షకులు జరిగితీరాలన్నారు. ఆ నాట్యకత్తెలని, నిర్వాహకుడిని అరెస్టు చేశారు.

మరి పోలీసులు ఎందుకు దాడి చేశారు?

"అది దరిదాపు నగ్ననృత్య ప్రదర్శన!

## మేలెంచిన కీడు

1969 అక్టోబర్‌లో దురై రాజ్ అనే విద్యార్థి యస్. యస్. యల్. సి. పరీక్షలకి మద్రాసులో హాజరయాడు. పరీక్షా కేంద్రములో ఈ 'దురై రాజ్' దురై రాజ్ కాదని అధికారి అనుమానించి పోలీసులని పిలిపించాడు. నిజం తేలింది. నల్లతంబి అనేవ్యక్తి దురై రాజ్ కోసం పరీక్ష వ్రాయడానికి వచ్చాడని తేలింది.

ఇప్పుడు ఆ నల్లతంబికి నేరం ఋజువయింది. కనుక మేజిస్ట్రేట్ 100 రూపాయిల జరిమానా విధించారు.

మరి దురై రాజ్ ఏమయాడు?

కూర్పు : టి. ప్రసాద్